# పీహెచ్‌సీ భవనం.. ప్రారంభోత్సవానికి సిద్ధం

- రూ.80లక్షల వ్యయంతో నిర్మాణం
- గత ప్రభుత్వ హయాంలోనే పనులు ప్రారంభం
- ఎమ్మార్ అప్పారావు కాలనీ ప్రజలకు అందుబాటులోకి రానున్న వైద్య సేవలు



నూజివీడు పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నూజివీడు: ఎమ్మార్ అప్పారావు కాలనీ.. దాదాపు 10వేల మంది జనాభా కలిగిన అతిపెద్ద కాలనీ. ఇక్కడ ఏ ఒక్కరికి జ్వరమొచ్చినా నాలుగు కిలోమీటర్ల దూరంలోని నూజివీడు పట్టణానికి పరుగెత్తాల్సిందే. అర్ధరాత్రయినా, అపరాత్రయినా ఇదే పరిస్థితి. అక్కడి వరకు వెళ్లలేకపోతే ఆర్‌ఎంపీలే కాలనీ వాసులకు దిక్కు. వారి వద్ద వైద్యం చేయించుకొని వారు అడిగినంత ఇచ్చుకోవాల్సిందే. ఈ పరిస్థితుల్లో కాలనీ వాసులకు ఎలాగైనా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంకల్పించింది. అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కాలనీలో రూ.80 లక్షల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు చురుగ్గా కొనసాగి ప్రస్తుతం ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ భవనం అందుబాటులోకి వస్తే ఎమ్మార్ అప్పారావు కాలనీ వాసులు వైద్యం కోసం పట్టణానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ ఆస్పత్రిలోనే రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను కూడా ఉచితంగా అందజేస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యులు అందుబాటులో ఉంటారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే అవసరం తప్పుతుంది.

**అందుబాటులో 10 పడకలు..**

ఆస్పత్రి భవనం ప్రారంభమైతే రోగులకు పది పడకలు సైతం అందుబాటులో ఉంటాయి. అలాగే దీనిలో ఫార్మసీ, ఔట్ పేషెంట్ గదులు, రెండు శస్త్రచికిత్స గదులు, లేబొరేటరీ, రోగుల సహాయకులకు విశ్రాంతి గదులు, వైద్యుల గది ఉన్నాయి. అంతేకాకుండా ఆస్పత్రికి అవసరమైన వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లను సైతం గతంలోనే ప్రభుత్వం నియమించింది. అన్ని రకాల రక్తపరీక్షలు ఇక్కడ ఉచితంగా నిర్వహిస్తారు.

### అందుబాటులో ప్రభుత్వ వైద్యం



ఆస్పత్రి ప్రారంభమైతే కాలనీ వాసులకు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. వైద్య సేవల కోసం నూజివీడు టౌన్‌కు వెళ్లాల్సిన పని ఉండదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు దీని కోసం ఎంతో కృషి చేశారు. పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి రావడం కాలనీ వాసుల అదృష్టమే.

– నౌషత్‌బేగం, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

### ఆ ఇబ్బందులు తప్పుతాయి..



ఇప్పటివరకు జ్వరం వస్తే పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికో, ఏరియా ఆస్పత్రికో పరుగెత్తాల్సి వచ్చేది. ఇక నుంచి ఆ అవసరం ఉండదు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే వైద్యసేవలు అందడమే కాకుండా అనేక రకాల రక్తపరీక్షలు, మందులు ఉచితంగా లభిస్తాయి. దీనివల్ల పేదలపై ఎలాంటి భారం పడకుండా వైద్యం అందుతుంది.

– షేక్ మస్తాన్‌వలీ, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

## అఘోరీని అడ్డుకున్న పోలీసులు



ఇబ్రహీంపట్నంలో అఘోరీ కారును అడ్డుకున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: జాతీయ రహదారి–65 పైన విజయవాడ వైపు కారులో వెళ్తున్న అఘోరీని పోలీసులు ఇబ్రహీంపట్నం రింగ్‌సెంటర్‌లో సోమవారం అడ్డుకున్నారు. మంగళగిరి వద్ద హడావుడి చేసిన అనంతరం మరలా విజయవాడ వైపు వెళ్తున్నట్లు ముందస్తు సమాచారం తెలుసుకున్న సీఐ ఏ.చంద్రశేఖర్ రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి కారును నిలువరించారు. కారులోనే ఆమె హారతి వెలిగించి పూజలు చేయడం ప్రారంభించింది. డోరు తెరవాలని పోలీసులు ఒత్తిడి చేసినప్పటికీ ఆమె తెరవలేదు. ఈ సంఘటనతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కోపోద్రిక్తులైన కొందరు యువకులు కారు డోర్ అద్దాలు పగులగొట్టేందుకు ప్రయత్నించారు. అయినా ఆమెలో స్పందన కనిపించలేదు. చివరకు సీఐ చంద్రశేఖర్ ఆమెతో మాట్లాడి తిరిగి హైదరాబాద్ వైపు పంపించారు. కొంతదూరం ఎస్కార్ట్‌గా పోలీసులు వెళ్లారు. అఘోరిని చూసేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు.

## తాగునీటి సమస్య తీర్చాలి



తెలంగాణ మంత్రి తుమ్మలకు తిరువూరు తాగు నీటి సమస్య గురించి వివరిస్తున్న స్వామిదాసు

తిరువూరు: తిరువూరు పట్టణ ప్రజల తాగునీటి సమస్య తీర్చడానికి సహకరించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు.

సోమవారం సత్తుపల్లిలో మంత్రి తుమ్మలను కలిసిన స్వామిదాసు కట్టలేరు పంపింగ్ స్కీముకు నీటికొరత తీర్చడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లంకాసాగర్ ప్రాజెక్టు నుంచి తిరువూరుకు సమృద్ధిగా నీరు సరఫరా అయ్యేదని, రాష్ట్ర విభజన తర్వాత తాగునీటి ఇబ్బందులు తీవ్రతరమయ్యాయని మంత్రి దృష్టికి తెచ్చారు. అధికారులకు తగు ఆదేశాలిస్తానని మంత్రి హామీ ఇచ్చారని స్వామిదాసు పేర్కొన్నారు.

## వాడవాడలా కార్తిక దీపోత్సవాలు



గంపలగూడెంలో లింగాకారంలో మహిళలు అమర్చిన దీపాలు



బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల విశేష పూజలు, దీపార్చనలు



ఆగిరిపల్లిలో శివలింగాకారంలో దీపార్చన

గంపలగూడెం: స్థానిక లిటిల్ ఏంజెల్స్ స్కూలు ఆవరణలో సోమవారం కార్తిక దిపోత్సవం నిర్వహించారు. ప్రమిదలను శివలింగాకారంలో అమర్చిన మహిళలు దీపాలు వెలిగించారు. గంపలగూడెం మండలంలోని పలు శివాలయాల్లో కూడా కార్తిక సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి.

**బలివేలో ప్రత్యేక పూజలు..**

ముసునూరు: కార్తిక మాసం మూడో సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు హరనామస్మరణతో మార్మోగాయి. బలివేలోని ప్రసిద్ధ బలేరామలింగేశ్వర స్వామి ఆలయంలో త్రిలోచనునికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజరాజేశ్వరీ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. చెక్కపల్లిలోని శివాలయం, భక్తాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. రమణక్కపేటలోని పార్వతీ సమేత శివాలయంలో భక్తులు శమీ వృక్షం చెంత దీపోత్సవాన్ని నిర్వహించారు.

**కిటకిటలాడిన శివాలయాలు**

ఆగిరిపల్లి: స్థానిక గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ అర్చకులు దేవులపల్లి శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శివలింగాకారంలో 108 దీపాలను వెలిగించారు. స్థానిక మెట్ల కోనేరు వద్ద గల బాలా త్రిపుర సుందర దేవి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో, ఈదులగూడెం నాగేశ్వర స్వామి ఆలయంలో పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు.

## పట్టువస్త్రాల బహూకరణ

ముసునూరు: కొర్లగుంటలో గుర్రాలమ్మ–గుర్రాలయ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. నాగవల్లేశ్వరరావు కుటుంబ సభ్యులు సోమవారం పట్టు వస్త్రాలను బహూకరించారు. బుధవారం అత్యంత వైభవంగా జరగనున్న స్వామి వారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తరించాలని కమిటీ సభ్యులు కోరారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ముసునూరు: చెక్కపల్లిలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మండలపు వెంకట రాధాకృష్ణ ఇంట్లో ఇటీవల భారీ చోరీ జరిగి.. నగదు, బంగారాన్ని దొంగలు అపహరించుకుపోయారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా మేకా ప్రతాప్ మాట్లాడుతూ జిల్లాలో చోరీలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, తక్షణమే పోలీసులు స్పందించి నేరాల అదుపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్ పేరం కృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు కాటేపల్లి లింగారావు, పార్టీ సీనియర్ నేతలు కాటేపల్లి రమేష్, పచ్చల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగురాలికి వీల్ చైర్ అందజేత



దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): నూజివీడుకు చెందిన కె.సంజనాప్రియకు ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం సంజనాప్రియ అర్జీని పరిశీలించి ఆమెకు ప్రస్తుతం అందుతున్న రూ.6వేల పింఛన్‌ను రూ.15 వేలకు పెంచే విషయంపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, డెప్యూటీ డీఎంహెచ్ఓ డా.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## 24న ఆర్యవైశ్య సమాజం ఎన్నికలు

తిరువూరు: తిరువూరు ఆర్యవైశ్య సమాజ కార్యవర్గ ఎన్నిక ఈ నెల 24న జరుగుతుందని ఎన్నికల అధికారి కొత్తగుండ్ల ప్రసాదరావు తెలిపారు. అధ్యక్ష పదవికి ఇద్దరు, ఉపాధ్యక్ష పదవికి ముగ్గురు, కార్యదర్శి పదవికి ఇద్దరు, సంయుక్త కార్యదర్శి పదవికి ముగ్గురు, కోశాధికారి పదవికి నలుగురు సహా మొత్తం 15 పదవులకు గానూ 32 మంది పోటీలో ఉన్నారన్నారు. ఈ నెల 24న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నిక జరుగుతుందని, ఆర్యవైశ్య సమాజ సభ్యులు తమ సభ్యత్వ గుర్తింపు కార్డు చూపి ఓటు వేయవచ్చని సూచించారు. పోలింగ్ ముగిసిన గంట తర్వాత ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

రెడ్డిగూడెం(మైలవరం): మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెంలోని పలు గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రం రెడ్డిగూడెంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూనపురాజు పర్వ, నాగులూరు, రంగాపురం, రెడ్డిగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. రైతుల నుంచి ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ ధాన్యం గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని సూచించారు. 75కిలోలు ధాన్యం బస్తా సాధారణ రకానికి రూ.1725, గ్రేడ్ ఏ రకపు ధాన్యానికి రూ.1740 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన**

ముసునూరు: చింతలవల్లిలోని ఆర్‌ఎస్‌కే వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ సోమవారం పరిశీలించారు. ధాన్యం శాంపిల్స్, తేమ శాతాన్ని పరీక్షించే మిషన్ పనితీరును పరిశీలించారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

గంపలగూడెం: మండలంలోని పెనుగొలను శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి డి. రాంబాబు అగ్ని ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పారు. గ్రంథాలయాధికారి శ్రీలత, షిర్డీ సాయిబాబా మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత నాగేశ్వరరావు మృతి

ఆగిరిపల్లి: మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అన్నే నాగేశ్వరరావు(85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన గతంలో కృష్ణవరం గ్రామ సర్పంచ్‌గా, పీఏసీఎస్ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన కుటుంబ సభ్యులను పలువురు రాజకీయ పార్టీ నాయకులు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరురూరల్: తిరువూరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ నూతన కార్యవర్గాన్ని సోమవారం మునుకుళ్ల గ్రామ సచివాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా వి. రవికుమార్ (మునుకుళ్ల), శరత్ (చింతలపాడు), ఉపాధ్యక్షుడిగా ఫణిగోపాల్(గానుగపాడు), కోశాధికారిగా లావణ్య (చౌటపల్లి) ఎన్నికయ్యారు.

## మద్యం సీసాల పట్టివేత

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో సోమవారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పరశురామయ్యను అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు.

## అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

ఆర్డీఓ మోవిడి వాణి



మీకోసం కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ మోవిడి వాణి

నూజివీడు: మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని, ఏమాత్రం అలసత్వం వహించినా సహించేది లేదని ఆర్డీఓ మోవిడి వాణి హెచ్చరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆర్డీఓ మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిలో రెవెన్యూ సంబంధిత సమస్యలే ఎక్కువగా ఉన్నాయి. మొత్తం 16 అర్జీలు రాగా వాటిని పరిష్కారం నిమిత్తం ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు పంపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఒకటి రెండు రోజుల్లో పరిష్కరించే సమస్యను సైతం గడువుందిలే అని చివరి వరకు పరిష్కరించకుండా ఉంచొద్దన్నారు. ఒకవేళ పరిష్కారానికి వీలు కాకపోతే అందుకు గల కారణాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. పాస్‌పుస్తకాలు ఇవ్వాలని, భూములను సర్వే చేయించాలని, పింఛన్లు ఇవ్వాలని, ఆక్రమణలు తొలగించాలని తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయి. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, డీఎల్‌డీఓ వెంకటరత్నం తదితర అధికారులు పాల్గొన్నారు.

## లెదర్ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోండి



లిడ్‌క్యాప్ చైర్మన్ మాణిక్యాలరావుతో చర్మకార సంక్షేమ సంఘం నాయకులు

జి.కొండూరు(మైలవరం): మైలవరం మండలం వెల్లటూరులో లెదర్ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చర్మకార సంక్షేమ సంఘం సభ్యులు లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావును కోరారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కవులూరు, జి.కొండూరు గ్రామాలకు చెందిన చర్మకార సంక్షేమ సంఘం సభ్యులు బట్టపర్తి రాజు, కురగంటి రాంబాబు, బుల్లరాజు సోమవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వం అజయ్ పథకం కింద లెదర్ పార్కు నిర్మాణానికి రూ.5.50కోట్లు నిధులు మంజూరు చేసిందని, తద్వారా మాదిగ నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. లిడ్ క్యాప్ చైర్మన్ మాణిక్యాల రావు స్పందించి త్వరలో వెల్లటూరులో గత లెదర్ పార్కు స్థలాన్ని పరిశీలిస్తానని తెలిపారు. సీనియర్ జిల్లా చర్మకార సంక్షేమ సంఘం నాయకులు నల్లమోతు ఏసోబు, గరికపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆధార్ క్యాంపులు

తిరువూరురూరల్/విస్సన్నపేట: రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. 19, 20 తేదీల్లో గానుగపాడు జెడ్పీ హైస్కూల్లో, 19న వావిలాల ఎంపీయూపీ స్కూల్లో, 21, 22 తేదీల్లో చౌటపల్లి ఎంపీపీ స్కూల్లో, 26, 27 తేదీల్లో ముష్టికుంట్ల జెడ్పీ హైస్కూల్లో, వామకుంట్ల ఎంపీపీ స్కూల్లో, 28, 29 తేదీల్లో మల్లేల జెడ్పీ హైస్కూల్లో, 28న కొమ్మిరెడ్డిపల్లి, 29న వావిలాల ఎంపీ యూపీ స్కూళ్లలో ఈ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే విస్సన్నపేటలో కూడా 19వ తేదీ నుంచి 22 వరకు.. తిరిగి 26 నుంచి 29వ తేదీ వరకు పాఠశాలలు, గ్రామ సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తామని ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు తెలిపారు.

## గ్రంథాలయంలో కవి సమ్మేళనం

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కవి సమ్మేళనం జరిగింది. ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా కవితలు ఉండాలని తిరువూరు రచయితల సంఘ సభ్యురాలు ఉయ్యూరు అనసూయ సూచించారు. గ్రంథాలయాధికారి పద్మావతి, తెలుగుభాషా వికాస సమితి కన్వీనర్ తోట ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

**వ్యాసరచన పోటీలు..**

ముసునూరు: గ్రంథ పఠనంతో అందరికీ పరిపూర్ణ జ్ఞానం లభిస్తుందని హిందీ ఉపాధ్యాయిని లక్ష్మీకుమారి అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గోపవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సీనియర్, జూనియర్లకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

## క్లుప్తంగా

### ముగిసిన భవానీ పేరంటాలమ్మ తిరునాళ్ల



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ప్రజల ఆరాధ్య దేవత చంద్రశేఖర సమేత భవానీ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల మహోత్సవం సోమవారం ముగిసింది. సాయంత్రం భక్తుల కోలాహలం మధ్య అమ్మవారి సిరిమానోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సిరిమానోత్సవాన్ని తిలకించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ దేవత తిరునాళ్లలో చివరి రోజు సిరిమానోత్సవం అనంతరం అమ్మవారికి పవళింపు సేవ జరిపారు. ఉత్సవాలు విజయవంతం చేసినందుకు భక్తులు గ్రామపెద్దలకు, రామిశెట్టి చంటి ధన్యవాదాలు తెలిపారు.

### బాలోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ



నూజివీడు: ఇటీవల నిర్వహించిన అమరావతి బాలోత్సవం, వీవీఐటీ బాలోత్సవంలో పట్టణానికి చెందిన త్రివిధ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ తెలిపారు. వ్యాసరచన, కార్టూన్, డ్రాయింగ్, తెలుగులో మాట్లాడటం, లేఖరచన, కవితా రచన, జానపద గీతాలాపన, క్విజ్ తదితర పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నూజివీడు: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు పాడుచేసుకోవద్దని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ డి. వెంకటేశ్వరరావు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో సోమవారం 'మాదక ద్రవ్యాలు–ఆరోగ్యంపై ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో కవిత, నిఖిల, పూజిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి విజేతలుగా నిలిచారు. హెచ్‌ఎం సత్యనారాయణ విజేతలను అభినందించారు.

### శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని వినతి



ఇబ్రహీంపట్నం: మూలపాడు ఎస్సీ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఆ గ్రామ ప్రజలు విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతిపత్రం అందజేశారు. వందేళ్లకు పైగా 2.42 ఎకరాల్లో ఎస్సీ శ్మశానవాటిక ఉందని డీసీసీ కార్యదర్శి చింతపల్లి దాస్ వివరించారు. ఇటీవల కాలంలో ఎన్టీటీపీఎస్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.4కోట్లు కలెక్టర్‌కు అందించారన్నారు. వాటిలో కొంత నిధులు కేటాయించి శ్మశానానికి ప్రహరీ, నిర్మించి మెరక పనులు చేపట్టాలని కోరారు.

### విద్యార్థులకు పోటీలు

జి.కొండూరు(మైలవరం): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జి.కొండూరు శాఖా గ్రంథాలయంలో 5వ రోజు పాఠశాల విద్యార్థులకు సోమవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ఆన్‌లైన్ తరగతులు పిల్లలకు మంచి చేస్తున్నాయా, లేక చెడు ప్రభావం చూపుతున్నాయా, జూనియర్స్ విభాగంలో 'మానవ సంబంధాలు–విలువలు' అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి వి. విజయకృష్ణ తెలిపారు.